
ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ	9985445760
ధర్మవరం, పుట్టపర్తి	9963160529
కదిరి	9052518170

ఏసీఎం: 9985411154





ఎర్రపుష్పాల రహదారి

కడప టు కర్ణాటక

- యథేచ్ఛగా ఎర్రచందనం రవాణా
- చెక్‌పోస్టులున్నా సరిహద్దు దాటేస్తున్న వైనం..
- రూటు మార్చిన ఎర్రదొంగలు
- పట్టుబడేది కొంత.. తరలిపోయేది కొండంత..
- కర్ణాటక నుంచి వచ్చే వాహనాలే తనిఖీ

పుట్టపర్తి, జూలై14(ఆంధ్రజ్యోతి): ఎర్రపుష్పల అక్రమ రవాణాకు జిల్లా రహదారులు అడ్డాగా మారాయి. గత వైసీపీ హయాంలో జిల్లా మీదుగా ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడిన ఘటనలు కోకొల్లలు. వరుసగా ఎర్రచందనం పట్టుబడిన నేపథ్యంలో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించి నేరుగా అప్పట్లో పెద్దల జోక్యంతో చెక్‌పోస్టుల్లో తనిఖీల్లేకుండా రైట్‌రైట్ అంటూ తలూపారు. దీంతో గత ఐదేళ్లలో టన్నుల కొద్దీ ఎర్రచందనం జిల్లా సరిహద్దు దాటించి, వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ఎర్రచందనం అక్రమ రవాణా దొంగల సమాచారం ఉన్నా.. అటవీ, పోలీసు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు మూటగట్టుకున్నారు. తాజాగా మదనపల్లి-కదిరి ప్రధాన రహదారి నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి వద్ద రెండు నంబరు ప్లేట్ల కారులో తరలిస్తున్న 13 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. దీంతో అక్రమ రవాణాకు జిల్లాలో రహదారులను స్మగ్లర్లు ఎంచుకున్నట్లు స్పష్టమవుతోంది. కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లు కొట్టి, ఎర్రముఠాలు జిల్లాలను సునాయాసంగా దాటిస్తూ కర్ణాటక, తమిళనాడుకు తరలిస్తూ రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్న వైనం తెలిసిందే. ఎర్రచందనం అక్రమ రవాణాపై పక్కా సమాచారం ఉంటేనే తప్ప.. అటవీ, పోలీసులు పట్టుకోవట్లేదు. దీంతో ఎర్రదొంగలు సరిహద్దు దాటేస్తున్నారు. ఎర్రచందనం పట్టుబడినపుడు అక్రమ రవాణా వెనుక గత ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు తెలిసినా.. అటవీ, పోలీసు అధికారులు.. బెంగళూరు, తమిళనాడు అంతర్రాష్ట్ర ముఠాల పనే అంటూ చెప్పుకొచ్చారు. నిజాలను కప్పిపుచ్చారు. జిల్లాలో పట్టుబడిన కూలీలు, దొంగల నుంచి రాబట్టిన సమాచారంతో సరిహద్దు దాటిన ఎర్రదొంగల మూలాలను పట్టుకునేందుకు కర్ణాటక, తమిళనాడు, కేరళకు వెళ్లిన జిల్లా పోలీసు బృందాలకు ఎర్రదొంగల నుంచి పలు సవాళ్లు ఎదురయ్యాయి. కొన్నేళ్లుగా కడప, అనంతపురం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఎన్నో చెక్‌పోస్టులున్నా ఎర్రచందనం ఎలా దాటిస్తున్నారనేది నేటికీ అర్థంకాని ప్రశ్న.



చిలమత్తూరు పోలీసులకు పట్టుబడిన ఎర్రచందనం (ఫైల్)

కడప టు కర్ణాటక..

కడప, అన్నమయ్య జిల్లాల్లోని బద్వేల్, కోడూరు, రాజంపేట తదితర అటవీ ప్రాంతంలోని ఎర్రచందనం చెట్లపై ఎర్ర ముఠాలు కన్నేశాయి. తమిళనాడు, కర్ణాటక నుంచి కూలీలను తరలించి స్థానికంగా ఉన్న ఎర్రచందనం దొంగల సహకారంతో కడప, అన్నమయ్య జిల్లాల నుంచి నేరుగా కార్లు ఆటోలు, గూడ్స్ లారీలతోపాటు పలు పద్ధతుల్లో ఎర్రచందనం తరలిస్తున్నారు. గత ఐదేళ్లలో జిల్లా మీదుగా తరలిస్తూ రూ.కోట్లు కొల్లగొట్టారు. 2022లో జాతీయ రహదారి 44పై చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన ఎర్రచందనం కడప జిల్లా అటవీ ప్రాంతాల నుంచి తరలిస్తున్నట్లు గుర్తించారు. కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల అటవీ ప్రాంతాల్లో భారీగా ఎర్రచందనం ఉంది. అటవీ ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంటోంది. జిల్లా సరిహద్దు వరకు అటవీ, పోలీసు నిఘా ఉన్నా.. ఎర్రదొంగలు పదుల సంఖ్యలో చెక్‌పోస్టులు దాటించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా తరలింపు రాచమార్గంగా ఉంటోందని భావిస్తున్నారు. అడ్డదారుల్లో వచ్చి జాతీయ రహదారిలో పడితే నేరుగా కర్ణాటకకు రాచమార్గంలో వెళ్లవచ్చు. ఐదేళ్లుగా జిల్లాలోకి వచ్చే గ్రామీణ, ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన సరిహద్దు సెబ్ చెక్‌పోస్టుల్లో కర్ణాటక నుంచి వచ్చే అనుమానిత వాహనాలను మాత్రమే తనిఖీ చేస్తున్నారు. జిల్లా నుంచి సరిహద్దు దాటే వాహనాలను అనుమానం వస్తే తప్ప.. తనఖీ చేయకపోవడం ఎర్రముఠాలకు కలిసివస్తోంది. ఈనేపథ్యంలో ఎర్రచందనం తరలింపులో రూటు మార్చి పోలీసులు, అటవీశాఖ అధికారుల కళ్లుగప్పి ఎర్రముఠాలు సరిహద్దు దాటించారు. ఎర్రచందనం తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వారిలో చిత్తూరు, కడప, తమిళనాడు, బెంగళూరు ప్రాంతాల్లోని అంతర్రాష్ట్ర ఎర్రచందనం ముఠాలే ఉన్నాయి. అటవీశాఖ కంటే పోలీసులే కాపుకాసి ఎర్రచందనాన్ని ఎక్కువగా పట్టుకుంటున్నారు. ఐదేళ్లుగా ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డాగా మారిన రహదారుల్లో కొత్త ప్రభుత్వమైనా నిఘా పెట్టి ఎర్రపుష్పల ఆటలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

పట్టుబడిన వాటిలో కొన్ని..

- గత ఐదేళ్లలో జాతీయ రహదారి మీదుగా జిల్లా సరిహద్దు దాటుతూ పోలీసులకు పట్టుబడిన ఎర్రచందనం కొంతే. పోలీసుల కళ్లుగప్పి సరిహద్దు దాటిన ఎర్రచందనం లెక్కలేదనే చెప్పాలి. రెండేళ్ల క్రితందాకా జిల్లా సరిహద్దులో చిలమత్తూరు పోలీసులకు 8395 ఎర్రచందనం దుంగలతోపాటు 15 వాహనాలు కలిసి రూ.5కోట్లకుపైగా విలువచేసే ఎర్రచందనాన్ని హిందూపురం రూరల్, చిలమత్తూరు పోలీసులే పట్టుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లా మీదుగా పలు రహదారుల్లో ఏమేరకు ఎర్రచందనం సరిహద్దు దాటేస్తోందో తెలుస్తోంది.
- 2022 మార్చి 10న రాజంపేట, తాడిపత్రి ప్రాంతాల నుంచి రూ.80 లక్షల విలువచేసే 1380 కిలోల ఎర్రచందనం దుంగలను కొడికొండ చెక్‌పోస్టులో స్వాధీనం చేసుకుని, 9 మంది అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేశారు.
- 2021 జూలై 31న కడప జిల్లా అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ఎర్రచందనం ముఠాను అరెస్టు చేసి, రూ.21 లక్షల విలువచేసే దుంగలను చిలమత్తూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పట్టుబడిన వారే జూలై 18న కారులో బెంగళూరుకి ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా కొడికొండ చెక్‌పోస్టులో పోలీసు తనిఖీలను చూసి, వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. రూ.9 లక్షల విలువచేసే 13ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి.
- 2021 నవంబరు 26వతేదీన తమిళనాడు నుంచి భక్తుల మారువేషాల్లో కడపకు వెళ్తున్న 40 మంది ఎర్రచందనం కూలీలను కొడికొండ చెక్‌పోస్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఎర్రచందనం చెట్లను నరికే యంత్రాలు ఇతర సామగ్రిని చిలమత్తూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- 2022 ఫిబ్రవరి 11న చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లి సమీపంలో ఎర్రచందనం దుంగల డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. రూ.20 లక్షల విలువచేసే 25 దుంగలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశారు.



పెద్దయల్లంపల్లి వద్ద పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, రెండు నంబర్ ప్లేట్లతో కారు

పురం అభివృద్ధిపై ముఖ్యమంత్రితో

చర్చించా..

అందరికీ ఇళ్లు నిర్మిస్తాం.. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివాదం చేస్తున్న బాలయ్య

హిందూపురం, జూలై 14: నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో అరగంటపాటు చర్చించినట్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలో ఆయన ఆదివారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అంతకు ముందు ఎమ్మెల్యే బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన బాగేపల్లి టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం చిలమత్తూరు మండలం సోమఘట్టలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి హిందూపురం మండలం కొటిపి సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్ల కోసం రూ.3.5కోట్లతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ చేశారు. అక్కడే టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనంతరం హిందూపురం పట్టణంలోని పరిగి బస్టాండు సమీపాన రూ.44.40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కేవీఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద కైవారం ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యాన్నదానాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే తన నివాసానికి చేరుకుని, పలుశాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ.. హిందూపురాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. 15రోజుల క్రితమే నియోజకవర్గ పరిధి పల్లెల్లో రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.90 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. వాటిని ఆయా మంత్రిత్వ శాఖలు ఆమోదించాయన్నారు. గత టీడీపీ హయాంలో నిలిచిపోయిన పనులను చేపట్టేందుకు రూ.90కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఆ నిధులు కూడా మంజూరయ్యాయని రెండు, మూడు నెలల్లో నియోజకవర్గంలో 150కోట్లతో పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో రోడ్ల విస్తరణ చేపడతామన్నారు. చిలమత్తూరు మండలానికి నీటి ఎత్తిపోతలకు సంబంధించి రూ.800కోట్లకు త్వరలో డీపీఆర్ పూర్తవుతుందన్నారు. ఇంటింటికీ నీరు సరఫరా చేస్తామన్నారు. యువతకు ఉద్యోగ కల్పన దిశగా నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి, అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తి, జూలై 14: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మునిసిపల్ కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇల్లు మొత్తం గుల్ల..

నగదు, బంగారం, సామగ్రి అపహరణ

ధర్మవరం, జూలై 14: పట్టణంలోని కేశవనగర్‌లోని డిజైనర్ నాగరాజు ఇంటిని దొంగలు గుల్ల చేశారు. శనివారం రాత్రి ఇంట్లో ఏ వస్తువూ వదలకుండా అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు పట్టుచీరల డిజైనింగ్ పనిచేస్తున్నాడు. పట్టణంలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న తన మామ అనారోగ్యం బారినపడడంతో నాగరాజు కుటుంబమంతా అక్కడికెళ్లింది. శనివారం రాత్రి అక్కడే నిద్రించారు. దీనిని ఆసరాగా చేసుకుని, దొంగలు పడ్డారు. ఇంటి తాళం బద్దలు కొట్టి, లోపలికి చొరబడ్డారు. ఇంట్లోని బంగారం, నగదు, పట్టుచీరలు, సామగ్రిసహా అపహరించుకెళ్లారు. ఆదివారం ఉదయం నాగరాజు ఇంటికి రాగా.. తాళం ధ్వంసమై కనిపించింది. కిటికీ నుంచి చూడగా ఇంట్లో ఒక్క వస్తువు కూడా కనిపించలేదు. చోరీ అయినట్లు గ్రహించాడు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లోని 10 తులాల బంగారు, రూ.2లక్షల నగదు, పట్టుచీరలు, పట్టు శాలువాలు, ఫ్రిజ్, కూలర్, కంప్యూటర్, మగ్గం డిజైన్ అట్టలు, రామకోటి పట్టువస్త్రం, స్థలాలు డాక్యుమెంట్లు సహా మొత్తం అపహరించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

మరిగారు మరి..!

సబ్‌కలెక్టర్ బంగ్లా పేరుతో

వైసీపీ నాయకుల మట్టి దందా

పెనుకొండ రూరల్, జూలై 14: గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు సాగించిన మట్టి దందా అంతా.. ఇంతా కాదు. రాత్రింబవళ్లు తరలిస్తూ రూ.కోట్లు కొల్లగొట్టారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం మూటగట్టుకుంది. మట్టి అక్రమాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. అయినా.. వైసీపీ నాయకులు మట్టి సొమ్ము మరిగి.. వదులుకోలేకపోతున్నారు. చాన్స్ దొరికితే మట్టి మాయలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పెనుకొండలోని సబ్ కలెక్టర్ బంగ్లాకు మట్టి అవసరం ఏర్పడడం అక్రమార్కులకు వరంగా మారింది. అంతే.. క్యాష్ చేసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి సబ్ కలెక్టర్ బంగ్లా ఆవరణలో చెట్లు నేలకూలాయి. ప్రహరీ దెబ్బతింది. దీంతో నూతనంగా నిర్మాణం చేపడుతున్నారు. సబ్ కలెక్టర్ బంగ్లా ఆవరణలోకి ఎర్రమట్టిని తరలించేందుకు అధికారులు.. వైసీపీ నాయకులకు అప్పజెప్పారు. ఎర్రమట్టికి డిమాండ్ ఉండటంతో ఇదే అదునుగా భావించిన వైసీపీ నాయకులు అక్రమ మార్గం వెతికారు. సబ్‌కలెక్టర్ బంగ్లా ఆవరణలోకి మూడు ట్రాక్టర్ల మట్టిని తరలిస్తూ.. మరో మూడు ట్రాక్టర్ల మట్టిని రూ.వెయ్యిచొప్పున పట్టణంలో అక్రమంగా సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై స్థానికులు.. తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజుకు సమాచారమిచ్చారు. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది మట్టి అక్రమ తరలింపును అడ్డుకున్నారు. వైసీపీ నాయకులను హెచ్చరించారు. అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.



సబ్ కలెక్టర్ బంగ్లా పేరుతో అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్



కాసులిస్తేనే.. కేసు కడతాం!

స్టేషన్‌లోనే బేరాలు.. పంచాయితీలు..

కాళ్లరిగేలా తిరిగినా కేసు నమోదు చేయని వైనం

జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్న బాధితులు

కట్టుతప్పిన పోలీసు

హిందూపురం, జూలై 14: సాధారణంగా పంచాయితీలు పల్లెల్లో రచ్చబండ దగ్గర చేస్తారు. వైసీపీ హయాం నుంచి ఇప్పటి వరకు పంచాయితీలు పోలీసు స్టేషన్‌లోనే చేస్తుండడం శోచనీయం. ఇప్పటికీ కొన్ని పోలీసు స్టేషన్లలో వైసీపీ నాయకులు చెబితేనే ముందుకు వెళ్తున్నారు. చాలా పోలీసు స్టేషన్లలో కేసు నమోదు చేయాలంటే బాధితులు కొంతమొత్తాన్ని సమర్పించుకోవాల్సిందే. ఈ విషయాన్ని ఇటీవల పోలీసు స్టేషన్‌కు వెళ్లిన వారే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. హిందూపురం పట్టణంలోని ఓ పోలీసు స్టేషన్‌లో రెండునెలల క్రితం భార్య భర్తలు గొడవపడ్డారు. భార్యను భర్త చితకబాదాడు. దీంతో ఆమె పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఆమెకు పోలీసులు షాకిచ్చారు. భర్త మీద కేసు నమోదు చేయాలంటే కొంత ఖర్చవుతుందని చెప్పారు. భరిస్తే కేసు నమోదు చేస్తామని చెప్పడంతో ఆమె పోలీసులకు కొంత మొత్తం ఇచ్చుకోవాల్సి వచ్చింది. అయినా అడిగినంత ఇవ్వకపోవడంతో తూతూమంత్రంగా కేసుకట్టి వదిలేశారు. దీంతో ఆమె ఉన్నతాధికారిని ఆశ్రయించాల్సి వచ్చింది. మరో స్టేషన్ పరిధిలో ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అతడి మృతి అనుమానంగా ఉన్నా.. తాము చెప్పింది చేస్తేనే ఆ మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసు స్టేషన్‌లో అధికారి వద్ద ఉండే ఓ పోలీసు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యుడిని పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితులు.. పోలీసులకు డబ్బులివ్వాల్సిన పరిస్థితి వచ్చింది. అదే స్టేషన్ పరిధిలో ఎన్నికలకు ముందు ఓ ఘటనలో ఇరువర్గాలు ఘర్షణపడి, దాడి చేసుకున్నారు. వారు ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావడంతో వారి కులపెద్దలు ఇరువర్గాలను మందలించి రాజీ కావాలన్నారు. స్టేషన్‌లో అన్నీ తానై చక్రంతప్పే ఓ పోలీసు మాత్రం వినకుండా కేసు నమోదు చేస్తామని బెదిరించాడు. కేసు కట్టకుండా ఉండేందుకు ఇరువర్గాలు కొంతమొత్తాన్ని ఇచ్చుకోవాల్సి వచ్చింది. తాజాగా పట్టణంలోని పోలీసు స్టేషన్ పరిధిలో వారం క్రితం ఓ మహిళ బస్టాండులో వేచి ఉండగా బ్యాగులో ఉన్న నగలపర్సును కొట్టేశారు. దీంతో స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించింది. కేసు కట్టాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్.. ఏఎస్ఐకు ఆదేశించారు. ఆయన మాత్రం రూ.15వేలు ఇస్తేనే లేదంటే 'మీపైనే అనుమానాలున్నాయ'ని ఎదురు ప్రశ్నలు వేశాడు. దీంతో చేసేదిలేక ఆరోజు వెళ్లిపోయారు. ఆ మరుసటి రోజు పక్క నియోజకవర్గ ప్రజాప్రతినిధి నుంచి ఫోన్ చేయించి, స్టేషన్‌కు వచ్చారు. అయినా ఆ ఏఎస్ఐ మాత్రం పట్టించుకోలేదు. తాను అడిగింది ఇస్తేనే కేసు కడతానని కరాఖండిగా చెప్పడంతో చేసేదిలేక రూ.5వేలు చెల్లించి కేసు నమోదు చేయించుకున్నారు. వారికి సదరు ఏఎస్ఐ రెండురోజులు చుక్కలు చూపించారని బాధితులతోపాటు స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అదే స్టేషన్‌కు నిత్యం పదుల సంఖ్యలో ఫిర్యాదుదారులు వస్తుంటారు. స్టేషన్‌లో కొంతమంది సిబ్బంది.. వారిని అక్కడే మాట్లాడి బయటకి వెళ్లి డబ్బు గుంజుతున్నట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇవి హిందూపురంలో మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటివి చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో స్థానిక పోలీసులపై నమ్మకం లేక జిల్లా పోలీసు అధికారులను ఆశ్రయించే వారి సంఖ్య పెరుగుతోంది. అసలు మండల, పట్టణ స్థాయిలో పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తే.. స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం చేస్తే వారు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కాళ్లరిగేలా తిరిగినా..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలీసులు ఆ పార్టీ నాయకులు చెప్పిందే న్యాయం.. చేసిందే చట్టంగా వ్యవహరించారు. అప్పట్లో వైసీపీ నాయకులు ఎవరి మీద కేసు పెట్టమంటే వారిపై కట్టారు. అసలు వారు బాధితులా, నిందితులా అనేది చూడకుండా వ్యవహరించారన్న విమర్శలు పోలీసు శాఖ మూటగట్టుకుంది. ఈ పరిస్థితుల్లో ఫ్రెండ్లీ పోలీస్ అనే పదం వినడానికే అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో చాలామంది బాధితులు కేసుల నమోదు కోసం స్టేషన్ల చుట్టూ తిరిగి విసిగి వేసారిపోతున్నారు. ఇటీవల ఓ ఉద్యోగి తనకు జరిగిన అన్యాయం కోసం హిందూపురంలోని ఓ పోలీసు స్టేషన్ కేసు కట్టించడానికి రెండు నెలలు పట్టింది. అప్పటికీ నమోదు చేయకపోవడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చేసేదిలేక కేసు కట్టారు. ఇటీవల రెండిళ్లలో చోరీలు జరిగాయి. పదిరోజులపాటు తిప్పుకుని ఆఖరికి కేసు నమోదుకు వీలులేదంటూ పంపించేశారు. ఇలాంటివి కోకొల్లలు.

ఉదాసీనం.. ఆపై ఉచిత సలహాలు..

పోలీసు స్టేషన్‌కు వెళ్తే న్యాయం చేకూరుతుందనీ, కొంత ఊరట లభిస్తుందని వెళ్లినవారిపట్ల పోలీసులు వ్యవహరిస్తున్న ఉదాసీనత అంతా ఇంతా కాదు. బాధితులు స్టేషన్‌కు వెళ్తే కొన్ని సందర్భాల్లో గంటల తరబడి అక్కడే ఉన్నా పలకరించే నాథుడు ఉండడు. అందుబాటులో సిబ్బంది ఉన్నా.. ఉచిత సలహాలు ఇచ్చి స్టేషన్ నుంచి పంపించేయడం తప్ప.. చేసేదేమీ ఉండదు. 'మీరే మాట్లాడుకోండి. మేమే అక్కడికి వచ్చి పరిష్కరిస్తాం. మీ ఇష్టం..' అంటూ పంపించేయడం పోలీసుల వంతవుతోంది.



జిల్లా ఉన్నతాధికారుల వద్దకు పరుగులు

స్థానిక పోలీసు స్టేషన్‌లో న్యాయం చేకూరకపోగా.. వారికి అనుమానం వచ్చేలా చేస్తుండటంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో జిల్లా ఉన్నతాధికారుల వద్దకు బాధితులు పరుగులు తీస్తున్నారు. ఇటీవల కాలంలో నెలకు హిందూపురం నుంచి జిల్లా ఎస్పీకి ఆశ్రయించేవారు పదుల సంఖ్యలో ఉన్నారంటే అతిశయోక్తికాదు. కొన్ని సివిల్ పంచాయితీల్లో పోలీసులే కల్పించుకుంటున్నారు. పంచాయితీలు చేస్తున్నారు. హిందూపురంలో వేల సంఖ్యలో భూవ్యవహారాలకు సంబంధించి తగాదాలున్నాయి. ఇలాంటి వాటిని పోలీసులు క్యాష్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హిందూపురం పట్టణ పరిధిలో వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన ఏరియాలో భూపంచాయితీలు అధికమయ్యాయి. వాటిని పోలీసులు దగ్గరుండి చేస్తున్నారు. సివిల్ కేసు వచ్చిందంటే దానిని పరిష్కరించేందుకు సిబ్బంది ఎగబడుతున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం మారినా ఇప్పటికీ పోలీసు స్టేషన్‌లో పంచాయితీలు చేస్తున్నారంటే వారు ఎంతటి ఘనులో అర్థం చేసుకోవచ్చు. ఏది ఏమైనా కొన్ని పోలీసు స్టేషన్లు.. పంచాయితీలకు అడ్డాలుగా మారాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ క్రీడాపోటీలకు జిల్లావాసుల ఎంపిక



ఎంపికైన పారా క్రీడాకారులతో అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: జాతీయ పారా క్రీడపోటీలకు జిల్లావాసులు ఎంపికయ్యారు. ఈనెల 16వ తేదీ నుంచి బెంగళూరులోని కన్నడ కంఠీరవ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయస్థాయి 13వ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2024కు ఎంపికైన వారిని ఆదివారం స్థానిక అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అధికారులు అభినందించారు. రాధిక, వెంకటేష్, ప్రతాప్‌కుమార్ రెడ్డి, నాగేంద్ర, వినయ్‌దత్, తిలక్, సుదర్శన్, భార్గవ్‌కుమార్, నరేష్, తరుణ్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్, కోచ్‌లు షఫీ, మంజుల, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 31 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్, జూలై 14: తుంగభద్ర జలాశయానికి 31.709 టీఎంసీలు చేరాయి. ఇన్‌ఫ్లో ఆదివారానికి 14,560 క్యూసెక్కులకు తగ్గింది. వారంరోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుదల మధ్య కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీలకు గాను 31.709 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్ ఫ్లో 203 కూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1606.81 అడుగుల వరకు నీరు చేరాయి. జలాశయం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. దీంతో తుంగభద్రకు చేరాల్సిన వరదనీరు ఆశించిన స్థాయిలో రావడం లేదు. గత వారం వచ్చిన వరదనీరు ప్రస్తుతం తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

జిల్లాకు చేరిన ఐసీఏఐ బస్సుయాత్ర

- పరిశ్రమల స్థాపనపై విద్యార్థులకు అవగాహన



ఐసీఏఐ జిల్లా కార్యాలయం వద్ద బస్సు యాత్ర బృందం సభ్యులు

అనంతపురం అర్బన్, జూలై 14: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం జిల్లాకు చేరుకుంది. చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు అండ్ స్టార్టప్‌లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 29వ తేదీన బెంగళూరు నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర తమిళనాడు, కేరళ, తిరుపతి, కడప మీదుగా అనంతకు చేరుకుంది. ముందుగా రాప్తాడు సమీపంలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో జడ్పీ సీఈఓ నిదియాదేవి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సువన సోనీ, రాప్తాడు ఎంఎస్ఎం ఈ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్ర తదితరులు మొక్కలు నాటారు. అనంతరం స్థానిక జేఎన్‌టీయూ సమీపంలోని ఐసీఏఐ జిల్లా శాఖ కార్యాలయంలో పారిశ్రామిక ఔత్సాహికులు, విద్యార్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నాగరాజారావు, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ మేనేజర్ చంద్రమౌళి, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారి రుద్రయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శేషాంజనేయులు, ఐసీఏఐ జిల్లా చైర్మన్ ప్రదీప్‌కుమార్, వైస్ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ రాఖీబ్, కార్యదర్శి ఫణికుమార్, కోశాధికారి అరవింద్‌రామ, చార్టెడ్ అకౌంటెంట్ వెంకటేష్, ఎంఎస్ఎం సభ్యుడు రవిశంకర్ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య



శిక్షణకు హాజరైన డ్వాక్రా సభ్యులతో డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: రైతు ఉత్పత్తిదారుల, డ్వాక్రా సంఘాలను సంస్థాగతంగా బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య అన్నారు. స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం డ్వాక్రా సంఘాల కృషి సఖిలకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు పండించే పంటలపై అవగాహన కల్పించడం, పంటలకు మార్కెటింగ్ చేయడం, రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే రైతు ఉత్పత్తిదారుల సంఘాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో సారవంతమైన నేలల్లో సేంద్రియ వ్యవసాయం పట్ల రైతులను ప్రోత్సాహించాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు అందించడంలో ముందుండాలన్నారు. డ్వాక్రా సంఘాలను సంస్థాగతంగా బలోపేతం చేస్తూ, ఇతర జిల్లాలకు అన్ని విభాగాల్లో నంబర్‌వన్‌గా నిలిచి మోడల్‌గా నిలపాలని సూచించారు. ఆధునికీకరణ పద్ధతులను అనుసరిస్తూ బీజామృతం, ఘన జీవామృతం, ద్రవజీవామృతం, సీమాస్త్రం, విత్తనశుద్ధి, ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేసి కృషిసఖి ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం రైతుసాధికార సంస్థ శిక్షకులు భానుమతి, భూపాల్‌రెడ్డి కృషిసఖిపై అవగాహన కల్పించారు. ఏపీఎంలు మరి, రియాజ్‌బేగ్, చిన్న వెంకటప్ప, భాస్కర్‌నాయుడు, సీసీ నారాయణస్వామి, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి



ఉత్తమ్మ మృతదేహం

తనకల్లు, జూలై 14: మండలంలోని కొక్కంటి గ్రామ దళితవాడకు చెందిన ఉత్తమ్మ (50) ఆదివారం ఆర్‌ఎంపీ ఇచ్చిన సూదిమందు వికటించి మృతిచెందింది. ఆమె బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొక్కంటి దళితవాడలో ఉత్తమ్మ, బావన్న దంపతులు నివాసం ఉంటున్నారు. ఉత్తమ్మ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండేది. కొక్కంటి క్రాస్‌లో ఉన్న ఎంఆర్ క్లినిక్‌కు వెళ్లింది. క్లినిక్ నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ అబ్దుల్లా సూది మందు ఇచ్చాడు. అది వికటించడంతో ఆర్‌ఎంపీ.. ఆమెను ఆటోలో తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మార్గమధ్యలో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. వారు రాగానే ఆర్‌ఎంపీ అక్కడి నుంచి జారుకున్నాడు. ఉత్తమ్మ మృతిపై ఫిర్యాదు అందలేదని తనకల్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. ఆదివారం రాత్రి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్ర నాయక్.. ఎంఆర్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. సీజ్ చేశారు. కొక్కంటి క్రాస్‌లో అర్హతలేని వారు క్లినిక్‌లు నిర్వహిస్తున్నారనీ, వెంటనే చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓను టీడీపీ నాయకులు కోరారు.

వేగంగా విస్తరిస్తున్న ఇసుక మేటలు

నివారణ చర్యలు శూన్యం

కణేకల్లు, జూలై 14: వేదావతి హగరి పరివాహక ప్రాంతంలో దాదాపు 200 ఏళ్ల క్రితం ఏర్పడిన ఇసుకమేటలు రోజురోజుకు విస్తరిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో దాదాపు 30 నుంచి 50 అడుగుల మేర ఎత్తులో ఇసుకదిబ్బలు ఏర్పడి ప్రజల జీవన విధానానికి ఆటంకంగా మారాయి. గతంలో ఇసుకమేటల నివారణకు ప్రభుత్వం అనేకచర్యలు తీసుకున్నప్పటికీ అవి అంతంత మాత్రంగానే ఉండడంతో అవి రోజురోజుకు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎడారిలో ఇసుకను తరలించేందుకు కొన్ని ప్రయత్నాలు చేసి దాదాపు 53 మంది రైతుల పొలాల్లో ఇసుకను కూడా తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం దీని ఏమాత్రం పట్టించుకోలేదు. తిరిగి టీడీపీ ప్రభుత్వం రావడంతో ఇసుకమేటలు నివారణకు చర్యలు తీసుకుంటారన్న ఆశ ఈ ప్రాంత ప్రజల్లో నెలకొంది.

ఐదువేల ఎకరాల్లో విస్తరణ

కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో విస్తరించిన ఇసుకమేటలు దాదాపు ఐదువేల ఎకరాల్లో వ్యాప్తి చెంది ఉన్నాయి. 200 ఏళ్ల క్రితం వేదావతి హగరికి పెద్ద ఎత్తున నీటి ఉధృతి రావడంతో ఇసుక అంతా ఈ ప్రాంతంలో ఉండిపోయింది. దాదాపు 12 గ్రామాల పరిధిలో ఇసుకమేటలు పెద్ద ఎత్తున విస్తరించి ఉన్నాయి.

జూలై, ఆగస్టు మాసాల్లో తీవ్ర ఇబ్బందులు

ప్రతి యేడాది జూలై, ఆగస్టు మాసాలలో వీచే బలమైన ఈదురుగాలులకు ఈ ప్రాంతంలో నివసించే ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. కణేకల్లు మండలంలోని కళేకుర్తి, మాల్యం, నాగేపల్లి, తుంబిగనూరు, గరుడచేడు, మీండ్లపల్లి, బిదురకుంతంతోపాటు బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహోన్నూరు, కళ్లుదేవనహళ్లి, గోవిందవాడ తదితర ప్రాంతాల్లో ఇసుకమేటలకు దిగువవైపున ఉండడంతో ఈదురుగాలుల వల్ల ఇసుకరేణువులు గ్రామాల్లోకి వస్తున్నాయి. మీండ్లపల్లి గ్రామంలోనైతే ఈ రెండు మాసాలలో తినే వస్తువులపై కూడా ఇసుకరేణువులు పడడంతో ప్రజలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.



బిదురకుంతం వద్ద విస్తరించిన ఇసుకమేటలు

పంటల రక్షణ సమస్యే..

ప్రాంతంలో వేదవతి హగరి ఉండడంతో రైతులు దాదాపు 50 అడుగుల్లోపే బోర్లు వేసుకుని పంటలు సాగుచేసుకుంటుంటారు. అందులో ప్రధానంగా వేరుశనగ, మొక్కజొన్న, సన్‌ఫ్లవర్ వంటి పంటలు అధికంగా పండిస్తుంటారు. అయితే పంటసాగు చేసే సమయంతోపాటు అవి మొలకెత్తే దశలో ఇసుకవ్యాప్తితో పంటలు మొలకెత్తేందుకు ఇబ్బంది తలెత్తుతున్నాయి. మొలకెత్తిన పంటలపై కూడా ఇసుక కప్పుతుండడంతో రైతులు చాలా జాగ్రత్తతో పంటలు పండించాల్సి వస్తోంది. ఇందుకోసం చాలా మంది రైతులు పొలాల్లో అక్కడక్కడ పరదాలు కట్టి ఇసుక వ్యాప్తి చెందకుండా పరిరక్షించుకుంటున్నారు.

సినిమా షూటింగ్‌లకు నిలయం

పెద్ద ఎత్తున ఇసుకతెన్నెలు ఉండడంతోపాటు కిలోమీటర్ల మేర ఇసుక వ్యాప్తి ఉండడంతో సినిమా నిర్మించే వారి కన్ను ఈ ప్రాంతంపై పడింది. ఈనేపథ్యంలోనే కొన్నేళ్ల కిందట ప్రముఖ నటుడు విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా నటించిన జయం మనదేరా సినిమా షూటింగ్ జరిగింది. అప్పటి నుంచి చిన్న చిన్న సినిమాలకు సంబంధించి షూటింగ్‌లు జరుగుతూ వస్తున్నాయి.



ఇసుక మేట వేయకుండా పొలాల్లో అడ్డంగా కట్టిన తెరలు

పంటసాగుకు తీవ్ర ఇబ్బందులు



మా గ్రామం చుట్టూ ఇసుక తప్ప మరేమీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ భూములనే చదును చేసుకొని పంటలు సాగు చేస్తుంటాం. అయితే పంటలు ఒక స్థితికి వచ్చేంత వరకు ఇసుక వ్యాప్తితో ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. గాలుల వచ్చే ఇసుక తాము సాగుచేసిన పంటలపై పడి పంట ఎదుగుదలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

- ప్రకాష్, రైతు, నాగేపల్లి

చిన్నప్పటి నుంచి చూస్తున్నా..



చిన్నప్పటి నుంచి ఇసుకమేటలను చూస్తున్నాను. ఇప్పుడు నాకు 55 ఏళ్లు . ఇసుకమేటలు రోజు రోజుకు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో మా జీవనానికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

- నాగరాజు, గరుడచేడు

తరలిస్తే బాగుంటుంది..



ఇసుకను తరలిస్తే వ్యవసాయం చేసుకుని రైతులు జీవించేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రభుత్వం చర్యలు తీసుకుని ఇసుకను తరలిస్తే బాగుంటుంది.

- ఎర్రిస్వామి, రైతు, మీండ్లపల్లి

ఆషాఢమాసంలో తీవ్ర ఇబ్బందులు



ఆషాఢమాసంలో వీచే బలమైన గాలుల వల్ల, గ్రామం పక్కనే ఉన్న ఇసుక అంతా ఒక్కసారిగా ఊరిలోకి వచ్చి పడుతుంది. దీంతో తినే అన్నంలోకి, ఇతర తినుబండారాల్లోకి ఇసుకరేణువులు పడుతునే ఉంటాయి. తద్వారా తమ జీవన విధానానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- చాముండి, గృహిణి, మీండ్లపల్లి

ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం

- ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఉమ్మడి ప్రణాళిక
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్.. నారా లోకేశ్‌తో భేటీ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తూ కలిసి పనిచేస్తామని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ అన్నారు. ఆదివారం అమరావతి రాజధాని ఉండవల్లిలోని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి చేనేత శాలువాతో ఫెర్రర్‌ను మంత్రి సత్కరించగా, పుష్పగుచ్ఛం అందజేసిన ఫెర్రర్ లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 1969లో విన్సెంట్‌ఫెర్రర్ ఆర్డీటీని స్థాపించి ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 3వేల గ్రామాల్లో ప్రభుత్వానికి సమాంతరంగా నిస్వార్థంగా సేవలందించడం స్ఫూర్తిదాయకమని లోకేశ్ కొనియాడారు. యువగళం పాదయాత్రలో ఆర్డీటీ కార్యాలయాన్ని సందర్శించిన లోకేశ్ టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆర్డీటీ సేవలు మరింత విస్తరింపచేసే విధంగా కలిసి పనిచేద్దామని ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు. ఎన్నేళ్లుగా జిల్లాను పట్టిపీడిస్తున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పన, స్వయం ఉపాధి, మహిళా సాధికారత, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఫారిన్ లాంగ్వేజెస్ శిక్షణ ఇతర దేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు ఆర్డీటీతో కలిసి పనిచేయాలని భావించినట్లు మంత్రి తెలిపారు. మంత్రి ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన మాంచోఫెర్రర్ ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రణాళికతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, సేవా, మౌలిక సదుపాయాల కోసం పనిచేస్తామన్నారు.



మాంచోఫెర్రర్‌ను సన్మానిస్తున్న నారా లోకేశ్

సీపీఎస్‌పై గత ప్రభుత్వ మోసాలు దారుణం

- నిరసనలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం విద్య, జూలై 14: సీపీఎస్‌ను వారంలో రద్దు చేస్తామని చెప్పి.... జీపీఎస్‌ను తీసుకొచ్చిన గత వైసీపీ ప్రభుత్వం మోసాలు దారుణం అంటూ పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ నేతలు క్లాక్‌టవర్ వద్ద జీపీఎస్ గెజిట్‌ను దహనం చేశారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చిందన్నారు. జీవో 54ను తీసుకురావడం దారుణమన్నారు. ఇది అమలు కాకుండా అనేక పోరాటాలు చేశారన్నారు. దానికి కొనసాగింపుగా ప్రస్తుత ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసిందన్నారు. ఈ గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, గౌరవాధ్యక్షుడు రమణయ్య, సీఐటీయూ నేతలు నాగేంద్ర, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గెజిట్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అదేవిధంగా 117 జీవోనూ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు సంజీవ్‌కుమార్, నాగేంద్ర, చిత్తప్ప, గంగాధర్, వెంకట్ నాయుడు, రాజ కుళ్లాయప్ప, సీతారాంరెడ్డి, రాజేంద్ర, హెన్రీ మార్క్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి: ఏపీసీపీఎస్ఈఏ నేతలు

వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకొచ్చిందని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధానకార్యదర్శి రామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీపీఎస్ గెజిట్‌కు తాము వ్యతిరేకమన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసినట్టుగానే ఈ జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు.

టమోటా కిలో రూ.50

అనంతపురంరూరల్, జూలై 14: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 60 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.32 పలికినట్లు ఆయన తెలిపారు.

రైతు సేవాకేంద్రాల్లో పశుగ్రాస జొన్న విత్తనాలు పంపిణీ

అనంతపురం అర్బన్, జూలై 14: జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీతో పశుగ్రాస జొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8వతేదీ నుంచి ఆదివారం దాకా రైతు సేవా కేంద్రాలు, పశువైద్యశాలల్లో పశుగ్రాస వారోత్సాలను నిర్వహించామన్నారు. పశుపోషణకు ఉపయోగపడే విధంగా 55 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. 75 శాతం సబ్సిడీతో పశుగ్రాస జొన్న విత్తనాలు పంపిణీ చే స్తామన్నారు. కేజీ పశుగ్రాసం విత్తనం పూర్తి ధర రూ.92లు, ఇందులో సబ్సిడీ రూ.69పోను రైతు వాటా కింద రూ.23లు చెల్లించాలన్నారు. 5 కేజీల విత్తనాల కిట్ రైతు సేవా కేంద్రంలో ఉంచామన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావు రిలీవ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 14: సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్ రావు రిలీవ్ అయ్యారు. ఈ నెల 2వ తేదీన రాష్ట్రశాఖ అధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జిల్లా కలెక్టర్ నుంచి రిలీవ్ ఆర్డర్ అందాల్సి ఉండగా ఆదివారం అందాయి. దీంతో ఆయన మంగళవారం రాష్ట్రశాఖకు జాయినింగ్ రిపోర్ట్ అందజేయనున్నారు. ఆయన స్థానంలో బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీకి ఎస్సీ సంక్షేమశాఖ డీడీ ఇన్‌చార్జ్ బాధ్యతలు జిల్లా కలెక్టర్ అప్పగించారు.

డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఓబుళమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: డీఆర్‌డీఏ-వెలుగు అనంతపురం పీడీగా ఓబుళమ్మ నియమితులయ్యారు. డీఎల్‌డీఓ ఓబుళమ్మను డీఆర్‌డీఏ-వెలుగు ఎఫ్‌ఏసీ పీడీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఓబుళమ్మ డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదివరకు పీడీగా ఉన్న నరసింహారెడ్డి దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. దీంతో ఏపీడీగా ఉన్న ఈశ్వరయ్య ఇప్పటి వరకు ఎఫ్ఏసీ పీడీగా కొనసాగారు.





శ్రీసత్యసాయి యూనిటీ కప్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మురళీకార్తీక్

సత్యసాయి క్రికెట్ టోర్నీ విజేత భారత్‌లెవన్

పుట్టపర్తి, జూలై 14: శ్రీసత్యసాయి యూనిటీ కప్ క్రికెట్ టోర్నమెంటులో విజేతగా భారత్‌లెవన్ నిలిచింది. ఆదివారం స్థానిక శ్రీసత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో టోర్నీని నిర్వహించారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి, మాజీ క్రికెటర్ మురళీకార్తీక్ టోర్నీని ప్రారంభించారు. మొదటిరోజు భారత్‌లెవన్, గ్లోబల్ లెవన్ మధ్య పోటీ జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన గ్లోబల్ లెవన్ 97 పరుగులకు ఆలౌట్ కాగా ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌లెవన్ ఒక వికెట్ కోల్పోయి 99 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం ఆర్‌జే రత్నాకర్ మాట్లాడుతూ సంవత్సరంపాటు అన్ని రాష్ట్రాల్లోని జిల్లాలు, అంతర జిల్లాలు, రాష్ట్ర, జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది జూలై 14న ప్రశాంతి నిలయంలో ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. సత్యసాయి సేవాసంస్థల్లోని సభ్యులు మాత్రమే ఈ టోర్నమెంటులో పాల్గొనడానికి అర్హులన్నారు. అనంతరం సాయికుల్వంత్ సభా మండపంలో సత్యసాయి గ్లోబల్ యంగ్ అడాల్ట్ ముగింపు సదస్సును నిర్వహించారు. సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే భవిష్యత్ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. క్రికెటర్ మురళీకార్తీక్ మాట్లాడుతూ ప్రశాంతి నిలయం వేదికగా క్రికెట్ టోర్నమెంటు నిర్వహించడం శుభపరిణామమన్నారు. తాను 1997లో సత్యసాయి బాబా దర్శనం చేసుకున్నానని, ఆ తర్వాత ఇండియా టీంలో అవకాశం లభించడం సత్యసాయి మహత్యమేనని అన్నారు. యువత సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత గానాన్ని నిర్వహించారు. భక్తులు మహా మంగళహారతి అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



వైసీపీ నాయకుడిపై కేసు

కదిరి, జూలై 14: కదిరి మున్సిపాలిటీ ఆవరణలో ఉన్న తుక్కును తరలించిన వైసీపీ నాయకుడు పరికి సాదిక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఫిబ్రవరిలో మున్సిపాలిటీలో ఉన్న తుక్కును అనుమతిలేకుండా బయటకు తరలించిన వైసీపీ నాయకుడు పరికి సాదిక్, మహబూబ్‌బాషాపై శనివారం కేసు నమోదు చేశారు. సుమారు 500 టన్నుల ఇనుప తుక్కును తరలించారు. దీని విలువ సుమారు రూ.15 వేలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మీడియా సహకారం మరువలేనిది: ఎస్పీ



ఎస్పీని సన్మానిస్తున్న మీడియా ప్రతినిధులు

పుట్టపర్తిరూరల్, జూలై 14 : మీడియా సహకారం వల్లే తనకు మంచిపేరు వచ్చిందని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. బదిలీపై పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్తున్న ఆయన్ను స్థానిక సాయి ఆరామంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో తాను 15 నెలల పాటు విధులు నిర్వహించానని, ఏనాడు మీడియా తనపై అనవసర నెగిటివ్ లేకుండా మంచికోణంలో వార్తలు రాసి తనను ప్రోత్సహించిందన్నారు. ఇంత మంచి మీడియా జిల్లాలో ఉండటం వల్లే పోలీసు వ్యవస్థకు, అధికారులకు, తనకు మంచి పేరు వచ్చిందన్నారు. ఎక్కడికి వెళ్లినా ఈ జిల్లా మీడియాను మరచిపోలేనన్నారు. ఇదే సహకారాన్ని వచ్చే అధికారులకు కూడా అందించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఎస్పీ మీడియాను కోరారు.

ప్రమాదాలకు నిలయం.. ఈ మలుపు



మలుపు వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

తాడిమర్రి, జూలై 14: బత్తలపల్లి నుంచి తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని ఏకపాదంపల్లి బస్టాప్ సమీపంలో ఉన్న ఈ మలుపు వద్ద పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏడాదికి కనీసం నాలుగు ప్రమాదాలు జరిగి.. ఎవరో ఒకరు మరణిస్తున్నారు. ఈ మలుపు వద్ద పెద్ద గొయ్యి ఉండటం... అక్కడ స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం.. పలు ప్రమాదాలకు దారి తీస్తోంది. అంతేకాకుండా రోడ్డుపక్కన పిచ్చి మొక్కలు భారీగా పెరిగి ఉండటంతో... ఎదుటి వాహనం వచ్చేది కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కరించి.. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

లారీ డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు

ఓబుళదేవరచెరువు, జూలై 14: రాష్ట్రంలోని డ్రైవర్లు, కీనర్ల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆల్ ఆంధ్ర డ్రైవర్స్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక షాదీమహాల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం డీజల్ అమ్మకాలపై ప్రతి లీటరుకు సంక్షేమ ట్యాక్స్ వసూలు చేసి.. దాన్ని డ్రైవర్స్, క్లీనర్స్ సంక్షేమ నిధికి జమ చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు కిరాయి ఎంతైతే ఉందో అందులో ఒక పర్సెంట్ కూడా సంక్షేమానికి జమ చేయాలన్నారు. లేదా సరుకు యజమాని ఆన్‌లైన్‌లో చెల్లించే విధంగా చూడాలన్నారు. దూర ప్రాంతాల్లో ప్రమాదాల్లో డ్రైవర్లు మరణిస్తే చాలా మంది అక్కడే డ్రైవర్లను ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలా కాకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత అంబులెన్స్ ద్వారా మృతులను స్వగ్రామానికి చేర్చేవిధంగా చూడాలని కోరారు. ప్రతి డ్రైవర్, క్లీనర్ బీమా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అనంతరం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటశివ, శ్రీనివాస్, సుధాకర్, మండల అధ్యక్షులు చిరంజీవి, ఆనంద్‌నాయక్, రహమతుల్లా, శివరాంరెడ్డి, హరీ, సోము, మురళి, పురుషోత్తం, శ్రీనివాస్, గంగరాజు, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

యూటీఎఫ్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ధర్మవరం, జూలై 14: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... సీపీఎస్ రద్దు చేసి... పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఇందులో నాయకులు రామకృష్ణనాయక్, రాంప్రసాద్, పెద్దకోట్ల సురేశ్, సాయిగణేశ్, రామాంజినేయులు, ఎన్‌వీ శివారెడ్డి పాల్గొన్నారు.

బస్సులు ఏర్పాటు చేయండి

నల్లమాడ, జూలై 14: నల్లమాడ నుంచి ఓడీసీ, అమడగూరు వరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆ మండల ప్రజలు కోరుతున్నారు. తారు రోడ్లు బాగున్నా... ఆర్టీసీ అధికారులు బస్సులు మాత్రం ఏర్పాటు చేయలేదని వాపోతున్నారు. అలాగే అమడగూరు, ఓడీసీ మండలాల ప్రజలు నియోజకవర్గా కేంద్రం, జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి వెళ్లాలన్నా... బస్సులు లేవన్నారు. బస్సులు లేకపోవడంతో అద్దె వాహనాల్లో వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. అలాగే నల్లమాడ నుంచి మలకవేమల వరకు బస్సులు లేకపోవడంతో రెడ్డిపల్లి, ఎర్రవంకపల్లి, మలకవేమల మధ్యలో గ్రామాల వారు కదిరికి, అనంతపురం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. నల్లమాడ నుంచి 20 కిలోమీటర్ల దూరంలో మలక వేమల వరకు డబల్ రోడ్డు ఉంది. అయినా ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేయలేదు. గంటల తరబడి ఆటోల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. నల్లమాడ, దొన్నికోట, పులగంపల్లి మీదుగా బస్సులు లేక మధ్యలో ఉన్న ఆయా గ్రామాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూడు రహదారుల్లో కనీసం రెండేసి బస్సులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా పుట్టపర్తి, కదిరి డిపో డీఎంలు ఈ రోడ్లను పరిశీలించి నూతన బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

యువకులపై కేసు

కొత్తచెరువు, జూలై 14: మండల కేంద్రంలోని ఓ యువతిని ఈవ్‌టీజింగ్ చేసిన ఇద్దరు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక కమ్మపాళ్యానికి చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన ప్రవీణ్, వేణు ఈవ్‌టీజింగ్ చేశారు. దీనిపై ఆ యువతి శనివారం పోలీసులకు ఫిర్యాది చేసింది. దీంతో ఆ ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశామని సీఐ రాజారమేశ్ ఆదివారం తెలిపారు.

నేటి నుంచి మహిళల క్రికెట్ పోటీలు

● సౌత్‌జోన్‌కు ముగ్గురి ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: జోనల్‌స్థాయి మహిళల క్రికెట్ పోటీలు సోమవారం నుంచి అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ప్రారంభించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. సౌత్‌జోన్ జట్టుకు జిల్లా నుంచి మనీషా, పల్లవి, బిందుమాధవి ఎంపికయ్యారు. చిత్తూరు, సౌత్‌జోన్, విశాఖపట్నం, నార్త్ జోన్, కృష్ణా, సెంట్రల్‌జోన్ ఆరు జట్లు పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఇప్పటికే ఆయా జట్ల క్రీడాకారులు స్టేడియానికి చేరుకుని సాధన చేస్తున్నారు. సౌత్‌జోన్‌కు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ఇక చేతినిండా పని

● ఉచిత ఇసుక విధానంపై భవన నిర్మాణ కార్మికుల హర్షం ● స్వగ్రామాలకు తిరిగి వస్తున్న వలస వెళ్లిన కార్మికులు



ముదిగుబ్బ, జూలై 14: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో తమకు చేతినిండా పని లభిస్తోందని భవన నిర్మాణ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో గత అయిదేళ్లుగా పనులు లేక కుటుంబాన్ని భారంగా నెట్టుకొచ్చామని, ఇప్పుడు ఆ తిప్పలు ఉండవని తెలిపారు. కావల్సినంత ఇసుక ఉన్నప్పటికి గత వైసీపీ ప్రభుత్వంలో కావాలనే కొరత సృష్టించి వైసీపీ నాయకులు అధిక ధరలకు విక్రయించి అందరినీ ఇబ్బంది పెట్టారన్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.6 వేలు పలికిందని, అవసరాన్ని బట్టి రూ.10 వేలకూ విక్రయించారని అన్నారు. దీంతో సామాన్యులు ఇసుక కొనుగోలు చేయలేక నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఉచిత ఇసుక విధానం భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో మళ్లీ వెలుగులు వస్తున్నాయన్నారు. ముదిగుబ్బ మండలంలో ఉప్పలపాడు రీచ్‌లో కావల్సినంత ఇసుక ఉన్నా... సామాన్య, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో లేకుండా పోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉప్పలపాడు రీచ్ నుంచి రాత్రుళ్ళు టిప్పర్‌లలో ఇసుక అక్రమంగా వైసీపీ నాయకులు అండతో బెంగుళూరుకు తరలించేవారన్నారు. వందలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయంతో ఇసుక అందరికి అందుబాటులోకి వచ్చింది. దీంతో భవన నిర్మాణ కార్మికులు మళ్లీ సొంత గ్రామాలకు వస్తున్నారని ఆ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మళ్లీ ఉపాధి దొరుకుతోంది..

గతంలో ఇసుక దొరకక చాలా మంది సామాన్యులు ఇళ్ళు నిర్మాణాలు ఆపేశారు. దీంతో రాళ్ల కొట్టుకునే మాకు ఉపాధి లేక ఇబ్బందులు పడ్డాం. టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుకతో మళ్లీ ఇళ్ళ నిర్మాణాలు జరుగుతున్నాయి. మాకు మళ్లీ ఉపాధి దొరుకుతోంది.

- కేతన ఆంజనేయులు, పునాది రాళ్లు కొట్టే కార్మికుడు, ముదిగుబ్బ



మంచిరోజులు వచ్చాయి

గతంలో నేనే పది మందికి పని కల్పించేవాడిని. అయితే గత ఐదేళ్లలో నాకే పని లేకుండా పోయింది. ఇసుక ఇబ్బందుల వలన ఎవరికి పని లేకుండా పోయింది. దీని వల్ల భవన నిర్మాణ కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వం ఇసుక పంపిణీలో తీసుకొచ్చిన మార్పులతో అందరికి పని లభిస్తోంది. మాకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి.

-బాబావలి, తాపీ మేస్త్రీ, ముదిగుబ్బ



పని లేక ఇబ్బందులు పడ్డాం

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అందుబాటులో లేక నెలలో కేవలం అయిదు రోజులే పని చేసేవాళ్ళం. ఆదాయం చాలక కుటుంబం గడవడమే కష్టంగా ఉండేది. వ్యవసాయ కూలీ పనికి వెళ్ళేవాళ్ళం. నూతన ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రవేశపెట్టడం వల్ల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. చేతినిండా పని లభిస్తోంది.

- అంకే పవన్, భవన నిర్మాణ కార్మికుడు, ముదిగుబ్బ



ఇబ్బందులు తొలగాయ్

గతంలో ఇసుక విధానం సరిగా లేకపోవడంతో ఒక్కసారిగా పనులు ఆగిపోయాయి. దీంతో కుటుంబాలను పోషించుకునే మార్గం లేక అప్పులు చేశాం. పిల్లల చదువులు భారంగా మారాయి. టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుకతో నిర్మాణాలు మళ్లీ ఊపందుకున్నాయ్. మా ఇబ్బందులు తొలిగాయి.

పీట్ల అనీల్, బేల్దారి, ముదిగుబ్బ

బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే

కదిరి, జూలై 14 : ఆర్టీసీ కదిరి డిపో ఆధ్వర్యంలో బెంగళూరుకు మరో కొత్త బస్సును కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. బస్సుకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బస్సులో కూర్చోని డ్రైవింగ్ చేశారు. ఇప్పటికే కదిరి నుంచి బెంగళూరుకు అనేక బస్సులు ఉన్నా.. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరో కొత్త బస్సును ప్రారంభించింది. ఈ బస్సు ఉదయం 5.45 కదిరిలో బయలుదేరి ఉదయం 11 గంటలకు బెంగళూరు చేరుతుందని, తిరిగి బెంగళూరులో 11.30లకు బయలుదేరి సాయంత్రం కదిరికి చేరుకుం టుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటలకు కదిరిలో బయలుదేరి రాత్రి 11.55 గంటలకు ఎలక్ట్రానిక్ సిటీ చేరుకుంటుందని డీఎం మైనుద్దీన్ తెలిపారు.

వైద్య శిబిరం..

పట్టణంలోని సీఆర్‌సీ క్లబ్ ఆవరణలో ఏబీఏ ఎంటర్ ప్రైజస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఈ శిబిరంలో గుండె, నరాలు, కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఉచిత పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు బనిత, అర్జున్, గంగిరెడ్డి తెలిపారు. అవసరమైన వారికి ఇతర చికిత్సలు కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జొన్నా రామయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం

ప్రభుత్వ భూములు, స్థలాల్లో ఎటువంటి ఆక్రమణలున్నా తొలగించాలని కదిరి ఎమ్మెల్యే ఆదేశించారు. ముత్యాలచెరువు, కదిరి మండల పరిధిలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమంగా వేసిన పునాదులపై కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పందించారు. సంబంధిత అధికారులకు ఆ కట్టడాలను వెంటనే తొలగించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అక్రమాలకు పాల్పడితే ఏపార్టీకి చెందిన వారైనా సహించేది లేదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అటువంటి భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేస్తామని అన్నారు.

ఆంజనేయస్వామి సేవలో..

నల్లచెరువు: మండలంలోని పాలపాటిదిన్నెలో ఆంజనేయస్వామిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ అర్చకులు నాగరాజు, సాయిప్రసాద్, ఈఓ రవీంద్రరాజు స్వాగతంలో పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజ అనంతరం ఆలయ అధికారులు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆలయ అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు గురించి ఎమ్మెల్యేకు ఈఓ వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఉచితన దర్శనం కల్పించాలని, పార్కింగ్‌కు డబ్బు వసూలు చేయకూడదని చెప్పారు. అన్నదానసత్రానికి భూమి పూజ చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రాజశేఖర్, మాబుసాబ్, అబ్దుల్ ఖాదర్, నాగభూషణం నాయుడు, అశ్వర్థనాయుడు ఉన్నారు.



పాలపాటిదిన్నెలో ఆంజనేయస్వామి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఘనంగా చిన్నసరిగెత్తు

బత్తలపల్లిలో ఖాసీంస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకుటున్న ఖాసీంస్వామి



ధర్మవరం కొత్తపేటలో ముస్తాబైన పీర్లు

బత్తలపల్లి, జూలై 14: బత్తలపల్లిలో ఖాసీంస్వామి చిన్న సరిగత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముస్లింలు స్వామివారికి పానకదుత్తలు సమర్పిస్తారు. ఈ వేడుకలకు జిల్లా నలములల నుంచి భక్తులు హాజరయ్యారు. భక్తులు స్వామివారికి వెండి గొడుగులు, శాలవాలు, పెద్ద పెద్ద పూలహారాలు సమర్పించారు. చక్కర, బెల్లం చదివించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గుడి వద్ద యువకులు, మహిళలు అలావ్ తొక్కారు. సోమవారం ఖాసీంస్వామిని ఘటాపురం, వెల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాల్లో ఊరేగిస్తారు.

ధర్మవరం : పట్టణంలోని కొత్తపేట సర్కిల్‌లో చిన్నసరిగెత్తును ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్, హుస్సేన్, ఇమామీ, ఖాశీం, మౌలాలి, బాబావలి, జలాలిటోపీ సాహెబ్ పీర్లస్వా ములను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పీర్లను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. భక్తులు పానకాలను తీసుకువచ్చి పీర్లస్వాములకు సమర్పించారు. అనంతరం అగ్ని గుండం వెలిగించారు. అనంతరం పీర్వస్వాములకు చక్కెర చదవింపులు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బిల్లే శీనయ్య, మాబు, మాబ్‌బాషా, చంద్ర, హుస్సేన్, సుభహాన్ పాల్గొన్నారు.

గాండ్లపెంట: మొహర్రం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని పీర్లచావిడిలో పీర్ల కొలువుదీశారు. మండలంలోని గాండ్లపెంట, వేపరాల, తూపల్లి, కటారుపల్లి, గొడ్డువెలగల, మల్లమీదపల్లి తదితర గ్రామాల్లో పీర్లను ప్రత్యేకంగా ఆలకరించారు. పీర్ల చావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. తప్పెట్లు వాయిద్యలతో అగ్నిగుండం చుట్టు పిల్లలు, పెద్దలు అల్లావ్ తొక్కారు. గాండ్లపెంట గ్రామంలో పుర వీధుల్లో పీర్లను ఊరేగించారు. పలువురు భక్తులు పీర్లకు చక్కెర సమర్పించారు. బుధవారం జలధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

కరాటే గ్రేడింగ్ పోటీలు

ధర్మవరం, జూలై 14: స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా పాఠశాల హెచ్‌ఎం మేరివర కుమారి, మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ మాస్టర్ ఇనాయత్‌బాషా, హిందూపురం, కదిరి సీనియర్ కరాటే మాస్టర్‌లు శ్రీనివాసులు, అక్బర్‌అలీ పాల్గొన్నారు. కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎల్లో, ఆరంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులను అందజేశారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థులు

నేడు వైద్యశిబిరం

నల్లమాడ, జూలై 14: మండలంలోని దొన్నికోట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పుట్టపర్తికి చెందిన జయశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో యూనిటేడ్ కింగ్ డమ్ (యుకే) వైద్యులు సేవలు అందిస్తారన్నారు. కంటి, చెవి, ముక్కు, స్త్రీల సమస్యలు, కీళ్ల నొప్పులు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్, బుద్ధిమాంధ్యం, మూత్రపిండాలు, మానసిక, దంత వ్యాధులపై ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. భోజన సదుపాయం ఉందని, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని తెలిపారు.

వ్యక్తికి గాయాలు

బత్తలపల్లి, జూలై 14: మండలంలోని లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో అనంతపురం పట్టణానికి చెందిన బాషా తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం నుంచి బత్తలపల్లికి బైక్‌పై వస్తుండగా లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాషాను స్థానికులు ఆర్‌డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని ఏఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు.

ఆలయంలో చోరీ

కొత్తచెరువు, జూలై 14: మండలంలోని పాతదేవర పల్లి గ్రామ సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. చెన్నకేశవస్వామి ఆలయంలోని మూలవిరాట్‌కు అలంకరించిన కళ్లు, మీసాలు, వెండి గొడుగు చోరీ అయ్యాయి. ఆదివారం ఉదయం పురోహితుడు పూజల చేయడానికి వెళ్లగా అక్కడ గర్భగుడి తలుపులు తీసి ఉండటాన్ని గమనించాడు. స్వామివారికి అలంకరించిన వెండి వస్తువులు చోరీ అయినట్లు గుర్తించాడు. విషయాన్ని గ్రామస్థులకు తెలిపారు. దీనిపై గ్రామస్థులు, పురోహితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ రాజారమేశ్ తెలిపారు.

షాపింగ్ మాల్ తొలగించే వరకూ పోరాటం

ధర్మవరం, జూలై 14: పట్టణంలోని ఓ ప్రముఖ షాపింగ్ మాల్‌ను తొలగించేంతవరకు తమ పోరాటం ఆపమని ధర్మవరం పట్టణ వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గిర్రాజురవి తెలిపారు. స్థానిక శమీనారాయణస్వామి ఆలయంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఈ షాపింగ్‌మాల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి తమ వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈ నెల 18న షాపింగ్ మాల్ వద్ద ధర్నా నిర్వహిస్తామని, ఈ షాపింగ్‌ను తొలగించేంతవరకు పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. ఈ సమావేశంలో వ్యాపారులు రంగం రామకృష్ణ, పల్లనవీన్, గిర్రాజు శశిధర్, గుండాపుల్లయ్య, నీలూరి శ్రీనివాసులు, నాగభూషణం, రెడిమేడ్ అండ్‌టెక్స్‌టైల్స్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు బీఎంబాషా, శేషాద్రిరెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్ర, ధనుంజయ, కార్యదర్శి మురళీ, కోశాధికారి సుధాకర్ పాల్గొన్నారు.

రహదారిపై మురుగునీరు





రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

ఓబుళదేవరచెరువు, జూలై 14: స్థానిక కదిరి, హిందూపురం ప్రధాన రహదారి పై మురుగునీరు నిత్యం ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బీసీ కాలనీలో, ప్రధాన రహదారి ఇళ్లవద్ద మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇళ్లలో మురుగునీరు వీధులపై వచ్చి రోడ్లపై నిలువ ఉంటోంది. రోగాలు ప్రబలకముందే మురుగునీటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



పూజలందుకుంటున్న కుళ్లాయిస్వామి

పోటెత్తిన భక్తజనం

కన్నుల పండువగా గూగూడు కుళ్లాయిస్వామి చిన్నసరిగెత్తు

నార్పల, జూలై 14: ప్రసిద్ధిగాంచిన గూగూడు కుళ్లాయిస్వామి చిన్నసరిగెత్తు కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గూగూడు కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా కుళ్లాయి స్వామిని దర్శించుకుని చక్కెర చది వింపులు, ఫతేహాలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్ ఎక్కువగా ఉండటంతో చాలా మంది భక్తులు ఆంజనేయస్వామి దర్శనం కాక వెనుదిరిగి వెళ్లిపోయారు. మంగళవారం పెద్ద సరిగెత్తు, బుధవారం జలధి కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



స్వామి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూలై 14: నగరంలోని ఐదో రోడ్డులో వెలసిన బీబీ ఫాతిమా దర్గా వద్ద 22నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున పిలుపునిచ్చారు. ఆదివారం దర్గాలో బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. మల్లికార్జున మాట్లాడుతూ... ఉత్సవాల్లో భా గంగా 22న పెట్టె మెరవణ, 23, 24, 26వ తేదీల్లో నిత్యపూజలు, 25న చి న్న సరిగెత్తు, 27న పెద్ద సరిగెత్తు, పానకాలు, 28న అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 30వ తేదీన ఉదయం 9 గంటలకు అమ్మవారి చివరి దర్శనం, అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని దర్గా కమిటీ సభ్యులు కోరారు.

గురుపౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జూలై 14: పట్టణంలో ప్రసిద్ధి చెందిన షిరిడీసాయినాథుడి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం బాబా ఆలయ ఆవరణంలో కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు మడకశిర పట్టణ ప్రముఖులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వేడుకలను విజయవంతం చేద్దామన్నారు. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం పలు కమిటీలను ఏర్పాటు చేశారు. గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పట్టణంలో ఆదివారం బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మడకశిర పట్టణానికి చెందిన ప్రముఖులు, కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ వాసులు హాజరయ్యారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

మడకశిర రూరల్, జూలై 14: తెలుగుదేశం పార్టీ.. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని గుండుమల గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి ఆనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తిప్పేస్వామి గ్రామానికి వెళ్ళి లక్ష్మీరెడ్డి భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు ఆయనతో పాటు మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, జడ్పీటీసీ సభ్యులు ఉమేశ్, మాజీ సర్పంచ్ గుండుమ చంద్రప్ప, ఎంపీటీసీ పాండురంగప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.49 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 14: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,49,470 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. మార్కెట్‌కు రూ.2,16,770, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,32,700 వచ్చిందని తెలిపారు.



సోమఘట్టలో వాటర్‌ప్లాంట్‌ని ప్రారంభిస్తున్నఎమ్మెల్యే బాలకృష్ణ



అంబులెన్స్‌ను ఉచితంగా అందిస్తున్న దాతలు

పురం ఆసుపత్రిని ఆదర్శంగా నిలపాలి

● వైద్యులు బాధ్యతగా పనిచేయాలి ● సిబ్బంది కొరత లేకుండా చూస్తాం: ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం అర్బన్, జూలై 14: రాష్ట్రంలోనే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి మోడల్‌గా నిలపాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచించారు. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి గతంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆసుపత్రికి ఏమి కావాలన్నా అందించడానికి దాతలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైద్యశాఖ మంత్రితో చర్చించి వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూస్తామన్నారు. ఆసుపత్రిలో ఐసీయూ పరికరాలు త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు. హెచ్‌డీఎస్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు కేవీఎస్ గ్రూప్ అధ్యక్షుడు జేఈ వెంకటస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్ అంబులెన్స్‌ను ఆసుపత్రికి వితరణగా అందించారు.

హెచ్ఎన్ఎస్ పంచాయతీరాజ్‌తో సమీక్ష

ఎమ్మెల్యే కార్యాలయంలో హెచ్ఎన్ఎస్ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా గొల్లపల్లి నుంచి హిందూపురం వరకు కాలువ పరిస్థితిపై ఆరా తీశారు. చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి ఎత్తిపోతల పథకంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 2018లో రూ.520కోట్లతో అయిపోయే పనిని వైసీపీ పుణ్యమా అంటూ రూ.800కోట్లకు చేరిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో నియోజకవర్గానికి రూ.100కోట్లదాకా నిధులు వస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సబ్‌స్టేషన్‌తో నిరంతర వెలుగులు

కొటిపి వద్ద సబ్‌స్టేషన్‌కు భూమిపూజ అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ గత తెలుగుదేశం హయాంలోనే టిడ్కో ఇళ్ళ నిర్మాణం పూర్తి దశకు చేరుకుందన్నారు. ప్రభుత్వం మారడంతో అవి నిలిచిపోయాయన్నారు. త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందిస్తామన్నారు. రూ. 3.5 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణం, మరో కోటి ఖర్చుతో ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే విద్యుత్ శాఖకు నిధుల చెల్లింపులు జరిగిపోయాయన్నారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో 1200 టిడ్కో ఇండ్లకు నిరంతరం విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందన్నారు. ఎస్ఈ, సురేంద్ర, ఈఈ భూపతి తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజల కేంద్రం ప్రారంభం

చిలమత్తూరు: సోమఘట్ట గ్రామంలో శుద్ధ జల కేంద్రాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. ముందుగా ఆయన బెంగళూరు నుంచి కొడికొండ చెక్‌పోస్టు మీదుగా నేరుగా సోమఘట్ట గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బాగేపల్లి టోల్‌గేటు వద్ద హిందూపురం ఎంపీ పార్థసారధి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, డాక్టర్ సురేంద్ర, మండల కన్వీనర్ రంగారెడ్డి, లక్ష్మీనారాయణయాదవ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. పూల మాలలు వేసి సత్కరించారు. జడ్పీటీసీ అనూష, లేపాక్షి మాజీ జడ్పీటిసి రామాంజినమ్మ, నాయకులు తిప్పారెడ్డి, లక్ష్మీనరసప్ప, మహేష్‌రెడ్డి, రంగప్ప, రామంజి, సోమశేఖర్, బేకరీ గంగాధర్, నందీషప్ప, అశ్వర్థప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వేణు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పేదలకు న్యాయం చేయండి

మండల పరిధిలోని కొటిపి రోడ్డులో పేదలు గుడిసెలు వేసుకున్నారని, వారికి ఇంటి స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని సీపీఐ నాయకులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు సమీఉల్లా, కమల్, నౌషద్, చాంద్‌బాషా, గంగాధర్, లింగప్ప, జిలాన్, జియా ఉన్నారు.

దైవారాధనే మోక్షానికి మార్గం



స్వామివారికి దశహారతులు పడుతున్న చైర్మన్ రేవతి రమణ



స్వామివార్లకు భక్తుల చేతులమీదుగా కలశాభిషేకం

అనంతపురం కల్చరల్, జూలై 14: దైవాన్ని ఆరాధించడం ద్వారానే మోక్షానికి మార్గం లభిస్తుందని ఇస్కాన్ జీబీసి చైర్మన్ రేవతి రమణ ప్రభు పేర్కొన్నారు. జగన్నాథ రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని లలితకళా పరిషత్‌లో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 జంటలచే సామూహికంగా కలశ పూజలు నిర్వహించి, స్వామివార్లకు భక్తుల చేతులమీదుగా కలశాభిషేకం చేయించారు. అనంతరం నిర్వహించిన స్వామివారి దర్బార్‌లో రేవతి రమణ ప్రభు చేతులమీదుగా స్వామివార్లకు దశహారతులు సమర్పించారు. భక్తులనుద్దేశించి రేవతి రమణ ప్రభు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. జగన్నాథుడి దర్శనం జన్మజన్మల పుణ్యఫలమని పేర్కొన్నారు. నేటి బిజీ ప్రపంచంలో మనం ఎంత బిజీగా ఉన్నా దైవారాధనకు ఎంతో కొంత సమయం ఖచ్చితంగా వెచ్చించాలని, అపుడే మన జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్, రాధా మనోహర్‌దాస్, శ్రీపాద వేణు, ఎలోకేపీ ప్రధాన కార్యదర్శి పద్మజ, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు



మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న నరేష్‌కుమార్

పెనుకొండ, జూలై 14 : యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని దివంగత హెచ్‌ఎం రామాంజనేయులు జ్ఞాపకార్థం స్థానిక జూనియర్ కళాశాల క్రీడామైదానంలో క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. జిల్లాస్థాయిలో సాగుతున్న ఈ క్రికెట్ టోర్నీలో ఆదివారం రెండో రోజు టోర్నమెంట్ కన్వీనర్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో పెనుకొండ వర్సెస్ ధర్మవరం జరిగిన పోటీల్లో ధర్మవరం జట్టు టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నారు. 12ఓవర్లలో 125పరుగులు చేశారు. పెనుకొండ జట్టు 52పరుగులు చేసి ఆల్‌అవుట్ అయింది. రెండోమ్యాచ్‌లో రొద్దం వర్సెస్ చెన్నెకొత్తపల్లి మధ్య పోటీజరగ్గా టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రొద్దం 12ఓవర్లలో 154పరుగులు చేశారు. చెన్నెకొత్తపల్లి 61పరుగులు చేసి ఆలౌట్ అయింది. రొద్దం క్యాప్టెన్ నరేష్‌కుమార్ 89పరుగుతో మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, గంగాధర్, శివయ్య, నరేష్, మారుతి, శేషాద్రి, ఉపేంద్ర, నాగార్జునరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

సౌకర్యాలులేని సచివాలయాలు

● గ్రామీణులకు అందని సేవలు ● స్టేషనరీ లేక సిబ్బందికి తిప్పలు

మడకశిర రూరల్, జూలై 14: గ్రామ సచివాలయాల్లో సరైన సౌకర్యాలు లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 18 గ్రామ సచివాలయాలున్నాయి. వాటిలో 196 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. కనీసం సరైన స్టేషనరీ లేదు. తరచూ సాంకేంతిక సమస్యలతో పట్టణాల్లోకి వెళ్లాల్సి వస్తోందని గ్రామీణులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ ఏడాది నుంచి స్టేషనరీ అందించడం లేదని, చాలా సచివాలయాలకు ఇంటర్‌నెట్ కనెక్షన్లు లేవన్నారు. కంప్యూటర్లు, ప్రింటర్ల మరమ్మతులు సొంత ఖర్చులతో చేయించుకుంటున్నామన్నారు. ఏ సమస్య వచ్చినా మడకశిరకు వెళ్లాల్సిందేనని గ్రామస్థులు వాపోతున్నారు.

నిధుల కొరత ఉంది : ఆరాధ్య, ఇన్‌చార్జీ ఎంపీడీఓ

గ్రామ సచివాలయాలకు నిధుల కొరత ఉంది. సచివాలయాలకు కావలసిన స్టేషనరీ గత ప్రభుత్వం సబ్ కాంట్రక్టర్‌తో నేరుగా సచివాలయాల స్టేషనరీ సరఫరా చేస్తుండేది. నిధుల కొరత కారణంగా సకాలంలో అందించలేకపోయింది. కూటమి ప్రభుత్వంలోనైనా సచివాలయాలపై దృష్టి పెట్టి ప్రజలకు సేవలందేలా చూస్తారని ఆశిస్తున్నాం.



భక్తరహళ్ళి గ్రామ సచివాలయం

ఉచిత కంటి వైద్యపరీక్షలు

పావగడ, జూలై 14 : స్థానిక హెల్ప్‌సొసైటీ, బెంగళూరు శంకర కంటి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మనిషి అవయవాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవని, వాటిని సంరక్షణకు ఎంతో జాగ్రత్త తీసుకోవాలని కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి తెలిపారు. పావగడ తాలూకా వ్యాప్తంగా విద్య, వైద్య, ఆరోగ్యంపట్ల ఎన్నో ఉచిత సేవా శిబిరాలను నిర్వహిస్తున్న హెల్ప్ సొసైటీ సేవా కార్యక్రమాలు అభినందనీయమని విశ్రాంత సాంఘిక సంక్షేమ శాఖాధికారి వైఆర్ చౌదరి అభిప్రాయ పడ్డారు. ఈ శిబిరంలో 200మంది పాల్గొనగా 62మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి బెంగళూరు శంకరకంటి ఆసుపత్రికి తరలించినట్లు సంస్థ నిర్వాహకులు, అధ్యక్షులు మానం శశికిరణ్ తెలిపారు. హెల్ప్ సొసైటీ సభ్యులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంకర రోడ్డుపై ప్రయాణం నరకమే



అధ్వానంగా తయారైన రోడ్డు

అగళి, జూలై 14 : మండలంలోని ఇరిగేపల్లి మండే మారెమ్మ దేవాలయం నుంచి గాయత్రి కాలనీ వరకు ఉన్న దూరం 4కి.మీ. అయినా వాహనదారులకు ప్రయాణమంటే చుక్కలు కనిపిస్తున్నాయి. కంకర తేలిన ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకయాతనగా మారిందని గాయత్రి కాలనీ వాసులు, హెచ్‌డీహళ్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకున్న పాపానా పోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా తాగునీటి కొళాయిలు

గుడిబండ, జూలై 14: మండలకేంద్రమైన గుడిబండలో ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి కొళాయిలు నిరుపయోగంగా మారాయి. ఐదేళ్ల నుంచి మండలంలోని గ్రామాలకు చుక్కనీరుకూడా అందలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కొళాయిలకు నీరు వచ్చేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



వృథాగా మారిన తాగునీటి కొళాయిలు

నగర పంచాయతీ గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

● విలీనమైనా వృథానే అంటున్న గ్రామీణులు ● విజృంభిస్తున్న దోమలు ● కానరాని పారిశుధ్య పనులు

పెనుకొండ రూరల్, జూలై 14 : నగర పంచాయతీ అయితే తమ గ్రామాల రూపు రేఖలు మారుతాయన్న ప్రజల ఆశలు అడియాశలవుతున్నాయి. 2021సంవత్సరంలో పెనుకొండ నగర పంచాయతీ ఏర్పడింది. గ్రామ పంచాయతీలుగా ఉన్న కోనాపురం, మంగాపురం, వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురంను పెనుకొండ నగర పంచాయతీలో విలీనం చేశారు. అయితే విలీనం అయిన గ్రామాల్లో అభివృద్ధిపై నాయకులు దృష్టి పెట్టడం లేదు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, చెత్తాచెదారం, ఎండిపోయి దుర్వాసన వె దజల్లుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన మురుగునీటితో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. దోమల భారిన పడి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఫాగింగ్ యంత్రాలు లేవని వాపోతున్నారు. నగర పంచాయతీకి 88మంది పారిశుధ్య కార్మికులు ఉండాల్సి ఉండగా 37మంది ఉన్నారు. రెండు ట్రాక్టర్లు ఒకటి కంపోర్ట్ వాహనం ఉన్నాయి. కనీసం డ్రైనేజీల్లో చెత్తాచెదారం తొలగించలేదు. కనీసం బ్లీచింగ్ పౌడర్‌వేసిన పాపానకూడా పోలేదన్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కోనాపురంలో అపరిశుభ్రతను చూపుతున్న స్థానికులు

● సిబ్బంది కొరత ఉంది: వంశీకృష్ణ భార్గవ్, కమిషనర్

పెనుకొండ నగర పంచాయతీలో 88మంది పారిశుధ్య కార్మికులకు గాను 37మంది మాత్రమే ఉన్నారు. వర్షాకాలంలో లార్వాలు ఉత్పత్తి కాకుండా దోమల నివారణకు ఫాగింగ్ చేపడతాం. అపరిశుభ్రత గ్రామాలను సందర్శించి శుభ్రత పనులు చేపడతాం.

పోటెత్తిన భక్తజనం



పూజలందుకుంటున్న కుళ్లాయిస్వామి

నార్పల, జూలై 14: ప్రసిద్ధిగాంచిన గూగూడు కుళ్లాయిస్వామి చిన్నసరిగెత్తు కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గూగూడు కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా కుళ్లాయిస్వామిని దర్శించుకుని చక్కెర చది వింపులు, ఫతేహాలు నిర్వహించారు. అంజనేయస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్ ఎక్కువగా ఉండటంతో చాలా మంది భక్తులు అంజనేయస్వామి దర్శనం కాక వెనుదిరిగి వెళ్లిపోయారు. మంగళవారం పెద్ద సరిగెత్తు, బుధవారం జలధి కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



స్వామి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

టీడీపీ నుంచి బహిష్కరణ

హిందూపురం,జూలై 14: చిలమత్తూరు మండలం కొత్తచామలపల్లికి చెందిన రామప్పను తెలుగుదేశం పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించడంపై సీరియస్‌గా పరిగణించిన అధిష్ఠానం పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. పార్టీ ఆదేశాలను, వ్యతిరేక విధానాలను అవలంభించిన ఎవరైనాసరే ఉపేక్షించేది లేదని ప్రకటనలో పేర్కొన్నారు. రామప్ప ఇటీవల పలు విషయాలపై ముఖ్యనాయకులను బహిరంగంగా విమర్శించడంతో పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి గాయాలు

హిందూపురం అర్బన్, జూలై 14: మండల పరిధిలోని సంతేబిదనూరులో శనివారం అదే గ్రామానికి చెందిన హైదర్ అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సంతేబిదనూరు గ్రామం చివరన పొలానికి సరఫరా అయ్యే విద్యుత్ తీగలు మరమ్మతులు చేయబోయి ప్రమాదానికి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రమాదంలో హైదర్‌కు రెండు చేతి వేళ్ళు కట్ అయిపోయాయని, శరీరానికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. ఈ విషయం ఆలస్యంగా తెలిసినట్లు విద్యుత్ శాఖ ఈఈ భూపతి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 14: మండలంలోని కొండిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకుడు శ్రీనివాసులు క్రిమి సంహారక మందు తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రంగప్పకుమారుడు శ్రీనివాసులు కటుంబ కలహాల కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్యకు యత్నించాడు. తల్లిదండ్రులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

19న మండల సర్వసభ్య సమావేశం

మడకశిర(అమరాపురం), జూలై 14: అమరాపురం మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 19వతేదీన ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు హాజరవుతారన్నారు. ఈసందర్భంగా మండల అభివృద్ధిపై చర్చిస్తామన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ సభ్యులు, మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల మండల స్థాయి ముఖ్య అధికారులు హాజరుకావాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

రొళ్ల, జూలై 14: రొళ్ల మండల కేంద్రంలోని బి.ఆర్.అంబేద్కర్ కాలనీకి చెందిన కె.చంద్రశ్రీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆమె తల్లిదండ్రులు కృష్ణమూర్తి, లక్ష్మీదేవిలు తెలిపారు. విద్యార్థి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి గత మార్చిలో జరిగిన ట్రిపుల్ ఐటీ పరీక్షలకు హాజరైనట్లు వారు తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికకావడం పట్ల కాలనీ వాసులు, తోటి విద్యార్థులు అభినందించారు.

హత్యచేసిన వారిని శిక్షించాలి

పెనుకొండ, జూలై 14 : కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన దళిత మహిళ గుండమ్మను హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కేవీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు పెద్దన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామంలో భూస్వాములు రాఘవేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డితోపాటు మరో నలుగురు గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేయడం అమానుషమన్నారు. నిందితులపై పోలీసు అధికారులు కేసు నమోదుచేసి అరెస్ట్ చేయకపోవడం బాధాకరమన్నారు.

ఇంట్లో చోరీ

గోరంట్ల, జూలై 14: పట్టణంలోని చైతన్య పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న పవన్‌కుమార్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. బంగారు, వెండి, నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. శుక్రవారం గూగూడుకు కుటుంబ సమేతంగా వెళ్లిన యజమాని రాత్రి తిరిగి వచ్చారు. అయితే అప్పటికే తలుపులు తెరిచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తలుపులు బద్దలు కొట్టి బీరువాలోని తులం బంగారు, 4 తులాల వెండితో పాటు రూ. 18వేల నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



బీరువాను పగలగొట్టిన దొంగలు

వారపుసంతలో అన్నదానం

పెనుకొండ, జూలై 14 : సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో వారపుసంతకు వచ్చిన వారికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి కన్వీనర్ శంకర్, సూర్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 21న గురుపౌర్ణమి సందర్భంగా ఆల్విన్ కాలనీలోని షిర్డీసాయి మందిరంలో కుంభాభిషేకం , ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

మొహరం వేడుకలు



పూజల్లో బాబయ్య ప్రతిమలు

హిందూపురం(పరిగి), జూలై 14 : మండల కేంద్రంలో ని సీతారామపురం కాలనీలో ఏర్పాటు చేసిన బాబయ్య ప్రతిమలకు ఆదివారం రాత్రి ఘనంగా పూజలు నిర్వహించారు. కులమతాలకతీతంగా బాబయ్య ప్రతిమలను దర్శించుకొని చదివింపులు చేసుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేసిన కమిటీ సభ్యులు రామకృష్ణ, మహేష్, సుధాకర్, నరసింహమూర్తి, మధు, అంజి, లింగారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టల్ ప్రారంభం ఎప్పుడో..?

గుడిబండ, జూలై 14 : మండల కేంద్రమైన గుడిబండలో బాలికల సౌకర్యార్థం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించారు. అయితే హాస్టల్ ఏర్పాటు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడిబండలో జూనియర్ ప్రభుత్వ కళాశాల, జిల్లాపరిషత్ ఉన్న త పాఠశాలకు ఎంతో మంది విద్యార్థినులు రోజు వివిధ గ్రామాల నుంచి వస్తుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని హాస్టల్ మంజూరు చేయిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని వారు కోరుతున్నారు.



వృథాగా మారిన భవనం

జిల్లాలో సదరం క్యాంపు ఏర్పాటు చేయాలి

అగళి, జూలై 14 : సత్యసాయి జిల్లాలో సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలని అగళి మండలం డొక్కలపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు హనుమంతరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయన నిరసన వ్యక్తం చేశారు. మదనపల్లిలో సదరం క్యాంపు ఏర్పాటు చేయడంవల్ల సుదూర ప్రాంతానికి తరలివెళ్లలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుడు మరో మనిషిని వెంటబెట్టుకుని చార్జీలు భరించాల్సి వస్తుందని, జిల్లాలోనే ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరమన్నారు. అధికారులు, నాయకులు దీనిపై స్పందించాలన్నారు.



దివ్యాంగుడు హనుమంతరెడ్డి

గ్రామాల్లో చిరుత సంచారం



హొసహళ్లితండా కొండ గుట్టలో చిరుత

పావగడ, జూలై 14 : తాలూకా పరిధిలోని కామనదుర్గ గ్రామ పంచాయతీలో హొసహళ్లితాండా, కెంచగానిపల్లి, మీనకుంటపల్లి గ్రామాల్లో చిరుతపులి సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. గడిచిన రెండు రోజుల క్రితం మేకలు, కుక్కలను ఎత్తుకెళ్లి చంపి తినిందని గొర్రెల కాపర్లు వాపోయారు. గొర్రెలు, మేకలు వచ్చివెళ్లే దారిలోనే కాపుకాచి దాడిచేసి తింటోందని, వారం రోజుల నుంచి ఎనిమిది గొర్రెలను తినేసిందన్నారు. మనుషులపై కూడా దాడిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు కాపలాదారులు వాపోయారు. రాత్రిపూట గ్రామ సమీపంలో వచ్చి గొర్రెలు, మేకల మందపై దాడి చేస్తోందని, అటవీశాఖ అధికారులు చిరుతను బంధించాలని వారు కోరారు.